క్లుప్తంగా

కొనసాగుతున్న శ్రీరామనవమి వసంతోత్సవాలు



స్వామి సన్నిధిలో లక్ష కుంకుమార్చన జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వసంతోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలనంతరం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీమద్రామాయణ, సుందరకాండ పారాయణాలు శాస్త్రోక్తంగా జరిగాయి. స్వామి సన్నిధిలో లక్ష తులసి, కుంకుమార్చన కార్యక్రమాలను అర్చకులు అత్యంత వైభవోపేతంగా కొనసాగించారు. యాగశాలలో గాయత్రీ రామాయణం, సంక్షేప రామాయణం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు



అప్పయ్యపేటలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట పంచాయతీ అప్పయ్యపేటలో సారా బట్టీలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. తమకి వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఎస్‌ఐ రామగణేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడులు చేపట్టగా గ్రామ శివార్లలో సారా తయారీకి నిల్వ ఉంచిన సుమారు 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామ గణేష్ మాట్లాడుతూ గ్రామాల్లో సారా తయారీ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సారా తయారీ చేసిన వారితో పాటు విక్రయించిన వారి పైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న భాస్కరరావు

జామి: మండలంలోని భీమసింగి నాలుగు రోడ్ల కూడలిలో వాకచర్ల భాస్కరరావు, చంద్రవతి దంపతుల ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. తన తండ్రి అప్పలరాజు జ్ఞాపకార్థం ఈచలివేంద్రం ఏర్పాటు చేసినట్లు భాస్కరరావు తెలిపారు. తొలిరోజు ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.కార్యక్రమంలో వి.నరేష్, సంతోష్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన పథకం నిర్వహణకు విరాళం



పథకం నిర్వాహకులకు నగదు అందజేస్తున్న దాత

చీపురుపల్లి: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన పథకం నిర్వహణ కో సం గరివిడి టీచర్స్ కాలనీకి చెందిన మజ్జి కమలాకర్ రూ.30 వేల విరాళం ప్రకటించారు. పథకం నిర్వాహకులు ఎస్.సన్యాసిరావుకు దాత గురువారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ నిత్యన్నదాన పథకం నిర్వహణ కోసం ఐదేళ్ల నుంచి ఏటా రూ.30 వేల చొప్పున అంద జేస్తున్నట్లు చెప్పారు. లయన్స్‌క్లబ్ సభ్యులు డి.సీతారామరాజు, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

వంగర: మండలంలోని పెదరాజులగుమ్మడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విజయనాగ మాహేశ్వరస్వామి(శివాలయం) ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన మిరియాల నర్సింగరావు, మిరియాల వెంకటరమణలు రూ.లక్షను విరాళంగా అందించారు. తండ్రి మిరియాల పకీరునాయుడు మాస్టారు జ్ఞాపకార్థం ఈ విరాళం అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మిరియాల సత్యవతమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన టీడీపీ



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కోలగట్ల వీరభద్రస్వామి, బెల్లాన చంద్రశేఖర్

- వలంటీర్ వ్యవస్థపై అక్కసు సిగ్గుచేటు
- ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఎంపీ బెల్లాన

విజయనగరం: ప్రతిపక్ష టీడీపీ ప్రజా విశ్వాసం కోల్పోయిందని, త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గురువారం నగరంలోని కొత్తధర్మపురి ప్రాంతంలో ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు ప్రజాప్రతినిధులు ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని అభ్యర్థించారు. వారికి స్థానిక మహిళలు ఎదురేగి ఘన స్వాగతం పలికారు. మంగళహారతులు పట్టి విజయతిలకాలు దిద్దారు. అనంతరం బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి ఎదో ఒక రూపంలో ప్రభుత్వ పథకాలను నేరుగా అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతి రహితంగా ప్రభుత్వ పథకాలను అందించటం జరిగిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని పారదర్శక పాలనను చూసి చంద్రబాబు తట్టుకోలేకపోతున్నాడని, అందుకే వలంటీర్ వ్యవస్థపై అక్కసు వెళ్లగక్కుతున్నాడని మండిపడ్డారు. టీడీపీ పట్ల ప్రజల్లో నమ్మకం పోయిందని, అదే పరిస్థితుల్లో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై అపారమైన అభిమానాన్ని ప్రజలు పెంచుకుని అక్కున చేర్చుకుంటున్నారని చెప్పారు. మరోసారి పార్లమెంట్ సభ్యునిగా తనను, శాసనసభ్యునిగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపిస్తే మరింత అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల ముంగిటకు అందిస్తామని హామీ ఇచ్చారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన విజయనగరం అభివృద్ధి జరిగిందంటే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషిగా పేర్కొన్నారు. మరో సారి అవకాశం కల్పిస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావు, డివిజన్ ఇన్‌ఛార్జి కనకల కృష్ణ, జోనల్ ఇన్‌ఛార్జి బొద్దాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఉపాధి పనులు



కవులవాడ గ్రామంలో ఎర్ర ట్యాంకు వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

భోగాపురం: మండలంలో ఉపాధి హామీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 2024 – 2025 ఆర్థిక సంవత్సరానికిగాను 8 లక్షల పని దినాలను గుర్తించారు. ఇందుకు సంబంధించి పనులను ఉపాధి హామీ పథకం సిబ్బంది గుర్తించారు. ప్రధానంగా భోగాపురం, ముంజేరు, ముక్కాం, సవరవిల్లి, కొండ్రాజుపాలెం, రామచంద్రపేట, నందిగాం, పోలిపల్లి, అమటాం రావివలస, తూడెం, రాజాపులోవ, గుడివాడ, చెరుకుపల్లి, లింగావలస, దల్లిపేట, గూడెపువలస, బైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు, చేపలకంచేరు, రావాడ, కవులవాడ, చాకివలస తదితర గ్రామాల్లోని చెరువులు, పంట కాలువల్లో ఉపాధి హామీ పనులు ముమ్మురంగా జరుగుతున్నాయి. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 80 శాతం నిర్దేశిత 8 లక్షల పని దినాలను సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఓ ఆదిబాబు తెలిపారు. గ్రామాల్లో పనులు కావాల్సిన కూలీలు సచివాయాలను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వీలైనంత ఎక్కువ మందికి పని దినాలు కల్పిస్తామన్నారు.

సమాజ హితం కోసమే రంజాన్ దీక్షలు



ముస్లిం సోదరులతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు చేసే కఠోర దీక్షలు, ఉపవాసాలు సమాజ హితం కోసమేనని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు ముస్లిం ప్రతినిధులు కోలగట్లకు గురువారం శుభాకాంక్షలు తెలిపి, శాలువాలతో సత్కరించారు. కోలగట్ల నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర మాసంలో ఉపవాసాలు ఉండి పవిత్ర హృదయంలో అల్లాను ప్రార్థించటం సంప్రదాయంగా వస్తుందన్నారు. ఇటువంటి పుణ్య కార్యక్రమాల్లో తనను కూడా భాగస్వాముడిని చేయటం సంతోషంగా ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా ముస్లిం సోదరులతో తనకు సన్నిహిత, స్నేహ సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. తరాలు మారినా ఆ అనుబంధం ఎక్కడ చెదిరిపోలేదన్నారు. తాను అధికారం చేపట్టాక దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించగలిగామన్నారు. ఎన్నికల సమయంలోనే కాకుండా అన్ని సమయాల్లో అందరితో కలిసిమెలసి ఉండటమే తన అభిమతంగా పేర్కొన్నారు. ప్రజలకు మేలైన పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీని మరో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో హరీష్, రహీం, మున్వర్, మాలిక్ పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన అవసరం : డీఎస్పీ



లింగాలవలసలో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గోవిందరావు

భోగాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ ఆర్. గోవిందరావు అన్నారు. మండలంలోని లింగాలవలస గ్రామంలో రానున్న సార్వత్రిక ఎన్నికలపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల సందర్భంగా గ్రామంలో ఎటువంటి అశాంతి మరియు గొడవలు సృష్టించకూడదన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరంలో అనవసరంగా వ్యక్తులు సంచరించకూడదని, ఎక్కువ మంది వ్యక్తులు గుమిగుడి ఉండరాదని తెలియజేశారు. కేవలం ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తులు మాత్రమే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్‌లో నిల్చొని తమ ఓటు హక్కును ను వినియోగించుకుని తిరిగి వెళ్లిపోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని ప్రజలకు తెలియజేశారు. ప్రైవేటు వ్యక్తులు పలు రకాలైన స్కీములు, చీటీలు పేరుతో చాలా మంది అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని, అదే విధంగా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భోగాపురం ఎస్‌హెచ్‌ఓ రవికుమార్, ఏఎస్‌ఐ టీఎస్ఎన్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వంగరలో బెల్లం ఊట ధ్వంసం

వంగర: మండల పరిధి జేకేగుమ్మడ గ్రామ సమీపంలో సారా తయారీకి సిద్ధం చేసిన వెయ్యి లీటర్ల పులిసిన బెల్లం ఊటను రాజాం ఎస్ఈబీ పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న సారా తయారీ శిబిరాలపై ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. ఈ సందర్భంగా గుర్తించిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తే ఉపేక్షించేది లేదని, వివరాలుంటే తమకు సమాచారం అందించాలని ఎస్ఈబీ సిబ్బంది ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సైలు ఎస్.చంద్రశేఖర్, ఎం.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



వంగర: బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

17 మద్యం బాటిల్స్ స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి కూడలి వద్ద ఓ మహిళ అక్రమంగా తరలిస్తున్న 17 మద్యం బాటిల్స్ పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. నిందితురాలిని మెంటాడ మండలంలోని కుంటినవలస గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

60 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

మెంటాడ:

మండలంలోని వనిజ గ్రామంలో 60 లీటర్ల సారాతో గురువారం ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ముందస్తు సమాచారంతోనే శివారు గ్రామమైన వనిజలో సిబ్బందితో నిఘా పెట్టి నిందితుడిని సారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆంధ్ర ఎస్సై బొడ్డు దేవి తెలిపారు. అనంతగిరి మండలానికి చెందిన వ్యక్తి సారా తీసుకు వస్తుండగా అదుపులోకి తీసుకుని కేసున మోదు చేసినట్లు చెప్పారు.



సారాతో పట్టుబడిన వ్యక్తి

అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఎంపీ బెల్లాన తదితరులు

విజయనగరం: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని ఏపీ శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. గురువారం పూలే జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ జంక్షన్ వద్ద గల పూలే నిలువెత్తు విగ్రహానికి పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, బీసీ సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. అనంతరం కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి పూలే చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. బడుగు బలహీన వర్గాలను అభ్యున్నతి వైపు తీసుకెళ్లేందుకు, సమసమాజ స్థాపనకు అలుపెరగని పోరాటం చేసిన మహావ్యక్తిగా అభివర్ణించారు. ఆయన బాటలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభ్యున్నతికి కట్టుబడి పని చేస్తున్నారన్నారు. 2019లో బీసీ డిక్లరేషన్ ప్రకటించి జయహో బీసీ నినాదంతో బీసీ వర్గాలను ఆదుకునేందుకు ముందడుగు వేశారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధిక సంఖ్యలో స్థానాలు బీసీలకే కేటాయించారని గుర్తు చేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ బీసీల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే ఆశయాలు అనుసరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు నడిపేన శ్రీనివాసరావు, బొద్దాన అప్పారావు, మారం బాలబ్రహ్మారెడ్డి, గదుల సత్యలత, కెల్ల త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త పూలే

భోగాపురం: మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఒక మాలి కులంలో జన్మించి అణగారిన వర్గాలను అగ్ర వర్ణ కులాల బానిసత్వం నుండి విముక్తులను చేయుటకు ఎనలేని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని నెల్లిమర్ల నియోజకవర్గం బహుజన సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎరుకొండ తేజరాణి అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం ఆమె మండలంలోని రెడ్డికంచేరు గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు ఎరుకొండ వెంకటరావు, చందాల చిన్నారావు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



విజయనగరం పూల్‌బాగ్: జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: జ్యోతిరావు పూలే జయంతి కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న పూలే విగ్రహం దగ్గర ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముద్దాడ మధు యాదవ్ మాట్లాడుతూ సంఘ సంస్కర్త నవయుగ వైతాళికుడు మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, మొదిలీ నాగభూషణరావు, గుంప అప్పలరాజు తదితర బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రమాకరంగా కుమిలి జంక్షన్

పూసపాటిరేగ : మండలంలోని కుమిలి గ్రామం ముఖద్వారం వద్ద ఆర్అండ్‌బీ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. వాహనాలు మితిమీరిన వేగంగా రావడంతో జంక్షన్‌లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రామతీర్థం, విజయనగరం, రెల్లివలస, సిహెచ్ అగ్రహారం నుంచి నాలుగు దిశలుగా వాహనాలు రావడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కుమిలి జంక్షన్‌లో స్పీడుబ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని వాహనచోదకులు, పాదచారులు కోరుతున్నారు.

అప్రమత్తతతో ప్రమాదాలకు చెక్

పూసపాటిరేగ : రహదారులపై ప్రయాణం చేసినప్పుడు అప్రమత్తతో వుంటే ప్రమాదాలు తగ్గించవచ్చునని ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూసపాటిరేగ మండలం జాతీయ రహదారిని ఆనుకొని వుండటంతో రహదారిపై ప్రయాణించే ప్రతి ఒక్కరు చాలా జాగ్రత్తతో వుండాలన్నారు. రహదారిపై ప్రయాణం చేసే ప్రతి ఒక్కరు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుముఖం పడతాయన్నారు.

ఆర్థికసాయం

బొబ్బిలి: పట్టణానికి చెందిన బారు సత్యనారాయణ సోదరి వివాహానికి ఆయన స్నేహితులు(1981 టెన్త్ బ్యాచ్) ఆర్థికసాయం చేశారు. తమ స్నేహితుడు సోదరి పెళ్లి కోసం డబ్బులకు ఇబ్బందులు పడుతున్నాడన్న విషయం తెలుసుకున్న వారంతా చందాల రూపంలో రూ.65 వేలు సేకరించి, అందజేశారు. సాయమందించిన స్నేహితులకు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమణమూర్తి, రామకృష్ణ, శ్రీనివాసరావు, రాంబాబు, శ్రీనివాసరావు, కూర్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.52 లక్షల నగదు సీజ్

బొబ్బిలి: పాతబొబ్బిలి అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ వద్ద ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తూ తరలిస్తున్న రూ.1,52,200లను పట్టుకుని సీజ్ చేసినట్లు సీఐ ఎం.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఎస్‌ఐ జి.లోవరాజు సిబ్బందితో కలిసి చేపట్టిన వాహన తనిఖీల్లో ఈ నగదు పట్టుబడిందని, వీటిని జెడ్పీ సీఈవోకు పంపించామన్నారు.

సముద్ర తాబేళ్లతో మత్స్యసంపద వృద్ధి



తిప్పలవలస తీరంలో తాబేలు పిల్లలను విడిచిపెడుతున్న డీఎఫ్ఓలు వెంకటేష్, ప్రసన్న తదితరులు

- డీఎఫ్ఓ వెంకటేష్

పూసపాటిరేగ: సముద్ర తాబేళ్లతో మత్స్యసంపద వృద్ధి చెందుతుందని జిల్లా ఫారెస్టు అధికారి ఎస్.వెంకటేష్ అన్నారు. మండలంలోని తిప్పలవలస తీరంలో ట్రీ ఫౌండేషన్, అటవీశాఖ హెచరీస్‌లో సంరక్షించిన 256 తాబేలు పిల్లలను గురువారం సముద్రంలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సముద్ర తీరంలో 19,532 తాబేలు గుడ్లను సేకరించామన్నారు. తీరంలోని 10 హెచరీస్ నుంచి సేకరించిన తాబేలు గుడ్లతో పిల్లలను ఉత్పత్తిచేసి సముద్రంలో విడిచిపెడుతున్నామని తెలిపారు. పర్యావరణ నేస్తాలైన సముద్ర తాబేళ్ల సంరక్షణతో వాతావరణం సమతుల్యంచెంది మత్స్యసంపద వృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా డీఎఫ్ఓ ప్రసన్న, ట్రీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ కామయ్య, మాజీ సర్పంచ్ వాసుపల్లి అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

రాజాం సిటీ: కొలతల ప్రకారం పనులు చేయాలని ఏపీవో కె.సాయిరాం సూచించారు. మండల పరిధిలోని కంచరాం చుట్టుచెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించిన ఆయన కనీస వేతనం రూ.300 వచ్చేలా రెండు పూటలా నిర్దేశిత కొలతల్లో పనులు చేయాలని తెలిపారు. ఎండల తీవ్రంగా ఉన్న నేపథ్యంలో టెంట్లు వేయాలని, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి తెలిపారు.

అన్నదానం

బొబ్బిలి: స్థానిక సీహెచ్‌సీ వద్ద గర్భిణులకు పట్టణంలోని సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. సాయి ప్రేమామృత పథకంలో భాగంగా గర్భిణులకు ఈ పౌష్టికాహారం అందిస్తున్నామని సత్య సాయి సేవా సమితి కన్వీనర్ బేతనపల్లి లక్ష్మణరావు తెలిపారు.